ఆలయాల్లో ఎమ్మెల్యే కృష్ణారావు ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పలు దేవాలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. బాలాజీనగర్‌ డివిజన్‌, ఆంజనేయ నగర్‌లోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రగతినగర్‌ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేలండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, డివిజన్‌ అధ్యక్షులు ప్రభాకర్‌ గౌడ్‌, అంబటి శ్రీనివాస్‌, ఆలయ చైర్మన్‌ శ్రీనివాస్‌, వినోద్‌, అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి ప్రణాళికపై కసరత్తు

- 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- ఉపాధి పనుల్లో చెరువు పూడికతీత, ఫీడర్‌ కాలువలు, కందకాల తవ్వకాలు
- వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలకు ప్రాధాన్యం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌– మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో (మేటీరియల్‌ కాంపౌండ్‌తో కలిపి) అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు (డీఆర్డీఏ)కసరత్తు చేస్తున్నాయి. వచ్చే ఏప్రిల్‌ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులకు సంబంధించిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించారు. శివారు జిల్లాల్లో 1,78,867 మంది కూలీలకు 11.83 లక్షల పని దినాల్లో రూ. 27.95 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 17,832 మంది కూలీలకు 1.71 లక్షల పని దినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నారు. కూలీలకు వంద రోజులు పనిని కల్పించటం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. నగర శివారు జిల్లాల్లో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవల సర్కారు 40 గ్రామ పంచాయతీలను సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న 580 గ్రామ పంచాయతీల్లోనే ఉపాధి హామీ పనులు జరిగేలా ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేస్తున్నాయి.

పనులిలా

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్‌ జిల్లాలో 2,369 మంది కూలీలకు 37,631 పని దినాలను కల్పించటం ద్వారా సామగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రతి రోజూ 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమై పని చేస్తున్నారు.

◆ రంగారెడ్డి జిల్లాలో కూడా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు 10.12 లక్షల పని దినాలను కల్పించిన డీఆర్‌డీఏ రూ.22.64 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొంటోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వటం, కాలువల నిర్మాణం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి గుంతలు తవ్వటం వంటి పనులను కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీలో గుర్తించిన పనులివే ..

ఉపాధి హామీ పథకంలో భాగంగా నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఉపాధి పనుల్లో భాగంగా ఊట కుంటలు, కందకాలు తవ్వటం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచటం, పల్లె ప్రకృతివనాలు, రైతు కళ్లాలు, ప్రభుత్వ స్థలంలో నేలను చదును చేయటం, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ ధామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయటం, డంపింగ్‌ యార్డులు, కామన్‌ ల్యాండ్‌ సోక్‌ ఫిట్స్‌, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్‌ వేయటం, కంపోస్ట్‌ ఎరువుల గుంతలు, ఫీడర్‌ కాలువలు వంటి పనులను కూలీలు చేపట్టనున్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలు, పండ్ల తోటల నిర్మాణం, తాటి వనాలు పెంచటం, చేపల కుంటలు, మిషన్‌ భగీరథ కోసం కందకాలు, మైనర్‌ ఇరిగేషన్‌ కాలువల్లో పూడిక తీయటం, వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం వంటి ఉపాధి పనులు కూడా కూలీలు చేపట్టనున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్‌ : ఆయా డివిజన్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ అర్బన్‌ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. 132 జీడిమెట్ల డివిజన్‌ పరిధిలోని కుత్బుల్లాపూర్‌ గ్రామం జయరాం నగర్‌లలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. స్థానికులు వివిధ సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్‌, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, సందీప్‌ గౌడ్‌, మహేష్‌ గౌడ్‌, శ్రవణ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

4న సాక్షి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్‌: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 4న సాక్షి ఆధ్వర్యంలో ఎస్‌పీఆర్‌ గ్లోబల్‌ స్కూల్‌ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌పీఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ సొంటిరెడ్డి పున్నారెడ్డి మంగళవారం తెలిపారు. గాజులరామారం డివిజన్‌ చిత్తారమ్మదేవి నగర్‌లోని ఎస్‌.పీ.ఆర్‌ గ్లోబల్‌ స్కూల్‌ ఆవరణలో ఉదయం 9:30 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పోటీలో పాల్గొనేవారు ఎవరి మెటీరియల్‌ వారే తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 7997995252కు సంప్రదించాలని కోరారు.

ఘనంగా న్యూ ఇయర్‌ వేడుకలు

సుభాష్‌నగర్‌: న్యూ ఇయర్‌ వేడుకలను కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలోని పలు వాడల్లో జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు కేకులు కట్‌ చేసి పంచుకున్నారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.



సూరారం నార్త్‌ సిటీ హైస్కూల్‌లో ..



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న కోటిరెడ్డి

బాలుడిపై వీధి కుక్కల దాడి

కుత్బుల్లాపూర్‌: పతంగి ఎగర వేసేందుకు బయటకు వచ్చిన ఓ బాలుడిపై నాలుగు వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటన కుత్బుల్లాపూర్‌ రాఘవేంద్ర కాలనీలో జరిగింది. స్థానికంగా ఉండే లక్ష్మయ్య కుమారుడు అరవింద్‌(6) మంగళవారం మధ్యాహ్నం పతంగి ఎగరవేసేందుకు కమాన్‌ దగ్గరికి వెళ్లాడు. ఈ క్రమంలో నాలుగు కుక్కలు వెంటపడి కరిశాయి. మెడ వెనుక భాగం, మోచేతి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై వీధి కుక్కలను తరిమి ఆ బాలుడిని కాపాడారు.

ఆత్మరక్షణకు కర్రసాము దోహదం



కుత్బుల్లాపూర్‌ : కర్ర సాము ఆత్మరక్షణకు తోడ్పాటు అందిస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభగల విద్యార్థులు ఉన్నారని బూమ్స్‌ స్పోర్ట్స్‌ అకాడమీ ప్రతినిధి కృష్ణ అన్నారు. గోవాలో నిర్వహించిన 5వ నేషనల్‌ లెవెల్‌ కర్ర సాము పోటీలో తెలంగాణ నుంచి 12 మంది ఆటగాళ్లు పోటీలో పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్‌ ప్రాంతానికి చెందిన పలువురికి బ్రౌన్‌ మెడల్‌ రాగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభిలాష్‌కు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. శిక్షణకు వచ్చే విద్యార్థులు వారి ప్రతిభ ఆధారంగా ఆయా క్రీడలపై శిక్షణ ఇస్తూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో పాల్గొనే విధంగా తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి



సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 30న నగరంలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన కె.నాగరాజు జావెలిన్‌ త్రోలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్‌ రాష్ట్రంలోని రాంచీలో జరిగే ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయి అండర్‌–19 పోటీలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ ఉమాదేవి తెలిపారు. మంగళవారం నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్‌ డైరెక్టర్‌ జగన్‌, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్‌: ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్‌, రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చి వేశారు. దుండిగల్‌ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌ సర్వే నెంబరు 214లోని ప్రభుత్వ స్థలంలో ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ మున్సిపల్‌, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్‌ అధికారులు సదరు అక్రమ నిర్మాణాలను తొలగించారు.



ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం

నిజాంపేట్‌ : అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మధురా నగర్‌ కాలనీకి చెందిన జెట్టి అద్వై రూ.1,01,116 చెక్కును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌ పరిధిలోని మధురానగర్‌ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి భక్తులు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. దాతల వస్తూరూపేణ, ధనరూపేణ సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హేమంత్‌, విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, రాంబాబు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మేలుకో... మత్తు వదులుకో



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో స్వచ్ఛ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'యువత మేలుకో.. మత్తు వదులుకో' అనే నినాదంతో డ్రగ్స్‌ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి స్వచ్ఛ అభియాన్‌ సంస్థ నిర్వాహకులు మాధవరం కాంతారావు, కూకట్‌పల్లి ఏసీపీ, సెక్టార్‌ ఎస్‌ఐలు, పోలీస్‌ సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

- ఎమ్మెల్యే వివేకానంద్‌
- కేలండర్‌ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్‌: ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. దుండిగల్‌ పెద్దమ్మతల్లి ఆలయ నూతన కమిటీ సభ్యులు, వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చినంగి వెంకటేష్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే దేవాలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు.

◆ సీనియర్‌ సిటిజన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి భరత్‌ సింహా రెడ్డి, సీనియర్‌ సిటిజన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సలహాదారులు బల్వంత్‌రెడ్డి, అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీగౌడ్‌ ఉపాధ్యక్షులు ఎన్‌. నాగేష్‌, జి.నరహరి గౌడ్‌ రామన్‌ దురసి స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్‌ బతుకమ్మబండ శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగేష్‌, చెట్ల వెంకటేష్‌, పరమేష్‌ పంతులు, బస్వరాజు, అంజయ్య, శరణప్ప, రాచప్ప పాల్గొన్నారు.



నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌, బీజేపీ నేత భరతసింహారెడ్డి